క్లుప్తంగా

విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని లింగమయ్య కాలనీలో ఉన్న శ్రీసీతారామస్వామి ఆలయానికి ఎన్‌ఎంఆర్ యువసేన అధ్యక్షుడు, కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ రూ.5లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం సీతారామస్వామి, ఆంజనేయస్వాముల ధ్వజస్తంభ శిఖర ప్రతిష్ఠాపనలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మల్లేష్, మల్లేష్, తిరుమలరెడ్డి, కుమార్, వీరేశ్, శివ, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, రమేష్, కాలనీవాసులు, ఎన్‌ఎంఆర్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడి కుటుంబానికి చేయూత

సంగారెడ్డి టౌన్: సదాశివపేట్ మండల పరిధిలోని సూరారం గ్రామానికి చెందిన కల్లు గీత కార్మికుడు రాములుగౌడ్ ఇటీవల కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు మోకు జారి మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి కుటుంబానికి టాడి కార్పొరేషన్ నుంచి మంజూరైన రూ.25వేల చెక్కును సంగారెడ్డి బీసీ కార్పొరేషన్ కార్యాలయంలో బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి జగదీష్ మృతుడి భార్య యాదమ్మకు శనివారం అందజేశారు. కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్నగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్నగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

27న నిధి అప్‌కే నిఖత్

పటాన్‌చెరు టౌన్: భవిష్యనిధి సంస్థ ద్వారా ప్రతి నెల సమస్యల పరిష్కారానికి ఫిర్యాదుల్లో భాగంగా నిధి ఆప్‌కే నిఖత్ 2.0 ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ప్రాంతీయ కమిషనర్ విశాల అగర్వాల్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు కేంద్రాల్లో శిబిరాలను ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. బీహెచ్‌ఈఎల్ టౌన్ షిప్‌లోని జ్యోతి విద్యాలయ హైస్కూల్, రుద్రారం గీతం యూనివర్సిటీ, సదాశివపేట్ మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయాల్లో భవిష్యనిధి సమస్యలు ఉన్నవారు పైన పేర్కొన్న కేంద్రాల్లో తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

ప్రభుగౌడ్‌కు ఎంపీ టికెట్ కేటాయించాలి

సంగారెడ్డి టౌన్: బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభుగౌడ్‌కు మెదక్ ఎంపీ టికెట్ కేటాయించాలని గౌడ సంఘం నేతలు అన్నారు. సంగారెడ్డిలో గౌడ సంఘం ఆధ్వర్యంలో శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మెదక్ ఎంపీ సీటును గౌడ సామాజిక వర్గానికి కేటాయించాలని బీఆర్‌ఎస్ అధిష్టానాన్ని కోరారు. 40ఏళ్లుగా రాజకీయంలో ఉంటూ ప్రజలకు సేవలందిస్తున్న ప్రభుగౌడ్‌ను గుర్తించి ఎంపీ టికెట్ కేటాయిస్తే గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్నగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్నగౌడ్, మాజీ జెడ్పీటీసీ మల్లగౌడ్, నరసింహగౌడ్, సుధాకర్‌గౌడ్, మల్లేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

మంత్రి దామోదరకు ఆహ్వానం

శివ్వంపేట(నర్సాపూర్): బగలాముఖీ శక్తిపీఠం మొదటి వార్షికోత్సవానికి రావల్సిందిగా రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహకు శనివారం ఆహ్వాన పత్రిక అందజేశారు. 28, 29న వార్షికోత్సవం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే రఘునందనరావు, నరేంద్రనాథ్, నీలం మధు, ఆవుల రాజిరెడ్డితో పాలు పలువురికి ఆహ్వాన పత్రికలు అందజేశారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక



ఎన్నికైన టీఎస్‌యూటీఎఫ్ కమిటీ

చిలప్‌చెడ్(నర్సాపూర్): చిలప్‌చెడ్ ఉన్నత పాఠశాలలో శనివారం టీఎస్‌యూటీఎఫ్ నూతన మండల కమిటీ ఎన్నిక నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా వెంకటస్వామి, ఉపాధ్యక్షుడుగా ఆదినారాయణ, అనిత, ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ, కోశాధికారిగా మోహన్, కార్యదర్శిగా బాల్‌సింగ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వెంకటస్వామి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. ఉపాధ్యాయులు సంతోష్‌కుమార్, మహేశ్, శ్రీకాంత్, నజీర్, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూలుపై నజర్

- ప్రత్యేకంగా 9 బృందాల ఏర్పాటు
- మున్సిపల్ ఆస్తిపన్ను లక్ష్యం రూ.5 కోట్లు
- 100 శాతం వసూలు లక్ష్యంగా ముందుకు..

మున్సిపాలిటీలో పన్ను వసూళ్లపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. గతేడాది సాధించిన లక్ష్యం స్ఫూర్తిగా ఈ ఆర్థిక సంవత్సరం ముగింపునకు ముందే 100 శాతం పన్నులు వసూలు చేయాలనే లక్ష్యంగా అధికారులు ముందుకెళ్తున్నారు. పన్నుల వసూలుకు ఏడు బృందాలతో ట్రేడ్ లైసెన్సు పన్నుల వసూలుకు ప్రత్యేకంగా 2 టీములు ఏర్పాటు చేయడంతో పాటు సూపర్‌వైజర్లను ఏర్పాటు చేసి పన్నులు వసూలు చేస్తున్నారు.

– సదాశివపేట(సంగారెడ్డి)



పన్నులు వసూలు చేస్తున్న మున్సిపాలిటీ సిబ్బంది

సదాశివపేట మున్సిపాలిటీలో నివాస గృహాలు 8920, కమర్షియల్ దుకాణాలు 887, రెసిడెన్షియల్, కమర్షియల్ గృహాలు 703 ఉన్నాయి. వీటి ద్వారా మొత్తం 10,510 ఆస్తిపన్నులు వసూలు చేయాల్సి ఉంది.

పన్ను వసూలు లక్ష్యం రూ.5 కోట్లు

ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్ను వసూలు లక్ష్యం రూ.10 కోట్లు ఉన్నప్పటికీ పట్టణ పరిధిలోని మూడు పరిశ్రమలు ప్రియదర్శిని, ఎవన్ అర్గానిక్స్, ఇబ్జా పరిశ్రమలకు చెందిన రూ.5కోట్ల పన్నుల వసూళ్లకు సంబంధించి కోర్టు కేసులు ఉండటంతో వసూలు చేయడంలేదు. పట్టణ పరిధిలోని 26 వార్డుల్లో గృహ, వాణిజ్య పన్నుల వసూళ్ల రూ.5కోట్ల పన్నులను అధికారులు యుద్ధ ప్రతిపదికన వసూళ్లు చేస్తున్నారు. ఈ నెల ఫిబ్రవరి 23 వరకు దాదాపు రూ.2 కోట్ల మేర పన్నులు వసూళ్లు చేశారు.

ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు

100 శాతం పన్నులు వసూలు చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాలతో మున్సిపల్ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. పన్నుల వసూలుకు 9 బృందాలతో ట్రేడ్ లైసెన్సు పన్నుల వసూలుకు ప్రత్యేకంగా టీములు ఏర్పాటు చేయడంతో పాటు సూపర్‌వైజర్లను నియమించి పన్నులు వసూలు చేస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తమకు కేటాయించిన కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి పన్నులు వసూలు చేస్తున్నారు. వచ్చే నెల మార్చి చివరలో ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు ప్రకటిస్తుండడంతో చాలామంది ఆస్తిపన్నును ముందుగా చెల్లించేందుకు ముందుకు రావడంలేదని సమాచారం.



సదాశివపేట పట్టణంలోని దుకాణంలో ట్రేడ్ లైసెన్స్ పన్ను వసూలు చేస్తున్న సిబ్బంది

బాధ్యతగా భావించాలి



ఆస్తి పన్నులు వందశాతం వసూలు చేయడమే లక్ష్యంగా కృషి చేస్తున్నాం. పన్నుల వసూళ్లకు ప్రత్యేకంగా 9 బృందాలను ఏర్పాటు చేశాం. ఈ బృందాలు మున్సిపాలిటీకి రావాల్సిన ఆస్తి పన్నులను ఇంటింటికి వెళ్లి వసూలు చేస్తున్నాయి. పట్టణ ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరుతున్నాం.

–ఉమ, మున్సిపల్ కమిషనర్, సదాశివపేట

పొంచి ఉన్న ప్రమాదం

అధికారుల పర్యవేక్షణ కరువవడంతో విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశాలు పొంచి ఉన్నాయి. మండల పరిధిలోని ఎద్దుమైలారం, మక్తఅల్లూరు, చెర్లగూడెం గ్రామాల్లో పంటపొలాలకు వెళ్లేదారిలో ఉన్న విద్యుత్ స్తంభాలకు చెట్ల తీగలు, కొమ్మలు అల్లుకున్నాయి. దీంతో రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం ఉంది. అధికారులు వెంటనే స్పందించి స్తంభాలకు అల్లుకున్న చెట్ల తీగలు, కొమ్మలను వెంటనే తొలగించాలని రైతులు కోరుతున్నారు.

– కంది(సంగారెడ్డి)



మక్తఅల్లూర్ వెళ్లే దారిలో ట్రాన్స్‌ఫార్మర్ స్తంభాలకు అల్లుకున్న చెట్ల తీగలు

ఎంపీ టికెట్ రేసులో నువ్వా.. నేనా

- పోటీ పడుతున్న ఉజ్వల్‌రెడ్డి, శెట్కార్
- తుదిదశకు అభ్యర్థిత్వాల పరిశీలన
- కాంగ్రెస్ శ్రేణుల్లో తీవ్ర ఉత్కంఠ



ఉజ్వల్‌రెడ్డి



సురేష్‌శెట్కార్

జహీరాబాద్: కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎంపీ టికెట్లను అధికారికంగా ప్రకటించేందుకు సిద్ధమవుతుండడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది. జహీరాబాద్ పార్లమెంట్ టికెట్ కోసం జహీరాబాద్‌కు చెందిన కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఉజ్వల్‌రెడ్డి, నారాయణఖేడ్‌కు చెందిన మాజీ ఎంపీ సురేశ్ శెట్కార్ తీవ్రంగా పోటీ పడుతున్నారు. టికెట్ రేసులో ఇద్దరు మాత్రమే ఉన్నారు. ఈ మేరకు వారు అధిష్టానవర్గం స్థాయిలో తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అభ్యర్థుల బలాబలాలను, పార్టీ అంతర్గతంగా నిర్వహిస్తున్న సర్వేలను పరిగణలోకి తీసుకొని టికెట్ ఖరారు చేసే అవకాశం ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. కొత్త ముఖాలకు అవకాశం ఇస్తారా లేక గతంలో పదవిని నిర్వహించిన వారికి ప్రాధాన్యత ఇస్తారా అనే దానిపై అధిష్టానవర్గం ఆలోచించి నిర్ణయించవచ్చనేది ప్రచారం సాగుతోంది. గతంలో సురేశ్‌శెట్కార్ రెండుసార్లు టిక్కెట్‌ను దక్కించుకోగా ఒకసారి గెలుపొంది మరోసారి ఓడిపోయారు. అయినప్పటికీ మూడోసారి టికెట్‌ను దక్కించుకునేందుకు శెట్కార్ ప్రయత్నిస్తున్నారు. 2009లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన సురేశ్‌శెట్కార్ టీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన సయ్యద్ యూసూఫ్‌అలీపై 19,407 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున రెండోసారి పోటీ చేసిన శెట్కార్ టీఆర్‌ఎస్ తరఫున మొదటిసారి పోటీ చేసిన బీబీ పాటిల్ చేతిలో 1,44,631 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. 2019 ఎన్నికల్లో మాత్రం శెట్కార్‌కు బదులు ఎల్లారెడ్డికి చెందిన మదన్‌మోహన్‌రావుకు టికెట్ కేటాయించగా 6,229 ఓట్ల తేడాతో బీబీ పాటిల్ చేతిలో ఓడిపోయారు.

ఆటోడ్రైవర్లను ఆదుకోవాలి

సీఐటీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు మాణిక్



సీఐటీయూ జెండా ఆవిష్కరిస్తున్న మాణిక్

నారాయణఖేడ్: ఆటోడ్రైవర్లను ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు అతిమెల మాణిక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆటోడ్రైవర్లు సీఐటీయూ అనుబంధంగా ఉన్న ఆటోడ్రైవర్ల యూనియన్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాణిక్ మాట్లాడుతూ ఆటోడ్రైవర్లకు సామాజిక భద్రత పథకాలు లేవన్నారు. మోటారు వాహనాల చట్టసవరణతో చిన్నప్రమాదాలు జరిగినా రూ.వేల జరిమానాతో పాటు జైలుశిక్షకు అవకాశం ఉండటంతో డ్రైవర్లు వత్తిడిని వీడి దుర్భరంగా జీవనం గడుపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆటోడ్రైవర్లకు ప్రభుత్వం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ఆరోగ్య, ప్రమాద బీమా, పిల్లల చదువులు, వివాహాలకు ఆర్థికసహాయం అందించాలన్నారు. ఆ సంఘ జిల్లా, స్థానిక నాయకులు బాబురావు, అరుణ్, సతీష్, మోషప్ప, శ్రీను, కాన్షీరాం పాల్గొన్నారు. అనంతరం ఆటోడ్రైవర్ల సంఘ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాణిక్యం, ఉపాధ్యక్షుడిగా నర్సింహులు, ప్రధాన కార్యదర్శిగా ఆకాష్, సహాయ కార్యదర్శిగా దేవదాస్, కార్యనిర్వాహక కార్యదర్శిగా విఠల్‌రావు, కోశాధికారిగా బలరాం, సభ్యులుగా బాబన్న, విఠల్, సుభాష్, సంగప్ప, రామాగౌడ్, దశరథ్ ఎన్నికయ్యారు.

ఆయేషాబేగంకు డాక్టరేట్



ఆయేషాబేగం

పటాన్‌చెరు టౌన్: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని ఫార్మసీ విభాగం పరిశోధక విద్యార్థిని ఆయేషాబేగంను డాక్టరేట్ వరించింది. ఎల్సీ–ఎంఎస్/ఎంఎస్ ద్వారా జీవమాత్రికల్లో ఎంపిక చేసిన ఔషధాల జీవ విశ్లేషణ పద్ధతి అభివృద్ధి, ధ్రువీకరణ, ఫార్మకోకైనటిక్ అధ్యయనంలో దాని పనితనంపై ఆమె అధ్యయనం చేసి సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శివకుమార్ మార్గదర్శనం వహిస్తున్నారు. ఆయేషాబేగంను గీతం విశ్వ విద్యాలయం, ప్రొఫెసర్ డీఎస్ రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ జగత్తరణ్ దాస్, విశాఖపట్నం ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజా, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

ప్రతిభను గుర్తించేందుకే సైన్స్‌ఫెయిర్

సంగారెడ్డి: విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించేందుకు సైన్స్‌ఫెయిర్ ఎంతో ఉపయోగపడుతుందని రావూస్ పాఠశాల చైర్మన్ ప్రభాకర్‌రావు పోల్సాని అన్నారు. రావూస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం సైన్స్‌ఫెయిర్ నిర్వహించారు. రావూస్ గ్రూప్ సీఈఓ విధాన్‌రావు పోల్సాని, గీతం యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ (కెమిస్ట్రీ) శశేంద్రఘోష్, ప్రధానోపాధ్యాయుడు నిఖిల్ రంగరాజు, సిబ్బంది సుష్మ దూబే, అవినాష్, కల్పన, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం



స్వయంపాలన దినోత్సవంలో పాల్గొన్న ఎల్గోయి పాఠశాల విద్యార్థులు

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని ఎల్గోయి, కృష్ణాపూర్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాల్లో శనివారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి రాజీమార్గమే మేలు

జహీరాబాద్: కేసుల పరిష్కారానికి బాధితులు, కక్షిదారులకు రాజీమార్గమే మేలు అని సీనియర్ సివిల్ జడ్జి సూరికృష్ణ, జూనియర్ సివిల్ జడ్జి అనూష అన్నారు. కోర్టు కాంప్లెక్స్‌లో న్యాయవాదులు, పోలీసులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించాలన్నారు. రాజీ పడదగ్గ కేసులను వచ్చే నెల 9వ తేదీన స్థానిక కోర్టు కాంప్లెక్స్‌లో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కారమయ్యేలా చూస్తామన్నారు. సమావేశంలో డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాలమన్, న్యాయవాదులు, పోలీసు అధికారులు, లీగల్ సర్వీస్ సిబ్బంది. పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌ఘఢ్‌కు చెందిన ధలవత్‌రామ్, అనిల్, విక్కీ బతుకుదెరువు కోసం రామచంద్రాపురం పరిధిలోని వెలమెలకు వచ్చి చిప్పింగ్ వర్క్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం స్నేహితులతో కలిసి వెలమెల మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు తీసుకుని స్నేహితుల రూమ్‌కు నడుచుకుంటూ వస్తుండగా రాజ్యం వైన్స్ సమీపంలోని బ్రిడ్జి వద్దకు రాగానే వెనుక నుంచి వచ్చిన డీసీఎం ధలవత్ రామును ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన ధలవత్ రామును చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి 10.45 మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడి స్నేహితుడు విక్కీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఐమాస్ట్ లైట్స్ ప్రారంభం



ఐమాస్ట్ లైట్‌ను ప్రారంభిస్తున్న నామరవికిరణ్ గుప్తా

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణంలోని బాగారెడ్డిపల్లిలో ఎంపీ నిధులతో ఏర్పాటు చేసిన ఐమాక్స్ లైట్లను బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ కౌన్సిలర్ నామరవికిరణ్ గుప్తా శనివారం ప్రారంభించారు. మున్సిపల్ పరిధిలోని 13వ వార్డు పరిధిలోకి వచ్చే బాగారెడ్డిపల్లిలో వడ్డెరులు నివాసం ఉంటారు. కాలనీలో చీకటి ఉందని, ఐమాస్ట్ పోల్ ఏర్పాటు చేయాలని వడ్డెర సంఘం నాయకులు ఇటీవల ఎంపీ బీబీపాటిల్‌ను కోరగా రూ.లక్ష మంజూరు చేసి కాలనీలో ఐమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయించారు. దీంతో వడ్డెర సంఘం నాయకులు ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే మాణిక్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు బండి మోహన్, సంఘం నాయకులు అశోక్, వెంకట్, శేఖర్, లక్ష్మణ్, నాగేష్, దశరథ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

హనుమాన్ ఆలయంలో ఇరుముడిపూజలు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని శివపంచాక్షరీ హనుమాన్ ఆలయంలో శివస్వాములు ఇరుముడి పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం శివస్వాములు ఇరుముడులతో కాశి జ్యోతిర్లింగాల దర్శనాలకు బయలుదేరి వెళ్లారు.

అయోధ్యకు తరలిన భక్తులు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణానికి చెందిన రామభక్తులు అయోధ్యకు శనివారం బయలుదేరి వెళ్లారు. శ్రీనివాస్ కుల్‌కర్ణి, పాట్‌పల్లి శ్రీనివాస్, సుధాకర్, ఏకనాథ్ పాటిల్, దేవిదాస్, రాజు, వీర్‌శెట్టి, ప్రకాశ్, అరుణ్‌కుమార్ తదితరులు అయోధ్యకు తరలివెళ్లినవారిలో ఉన్నారు.

ఎంపీ టికెట్‌పై సమాలోచన

జహీరాబాద్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ తరఫున జహీరాబాద్ ఎంపీ టికెట్‌ను ఆశిస్తున్న రవిశంకర్ పాటిల్ సన్నిహితులతో సమావేశమయ్యారు. నియోజకవర్గంలో లింగాయత్ సామాజిక వర్గానికి చెందిన ఓట్లు అధికంగా ఉన్నందునా టికెట్ కోసం ఢిల్లీ నేతలను కోరినట్లు చెప్పారు. తనకు మద్దతుగా నిలవాలని సామాజికవర్గానికి చెందిన ముఖ్యులతో సమాలోచనలు జరిపినట్లు రవిశంకర్ పాటిల్ తెలిపారు.

పోస్టాఫీస్ స్కీమ్‌లను సద్వినియోగం చేసుకోండి

మునిపల్లి(అందోల్): పోస్టాఫీస్ స్కీములను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పోస్టాఫీస్ బ్రాంచ్ మాస్టర్ కిషన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోస్టాఫీస్‌లో ప్రమాదబీమా, జీవిత బీమా, రూ.500తో సేవింగ్ ఖాతా, ఇంట్లో ఇద్దరు ఆడపిల్లలకు పదేళ్ల లోపు రూ.250తో సుకన్య సమృద్ధి అకౌంట్ వంటి వివిధ రకాల పథకాలు ఉన్నాయని తెలిపారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి

మునిపల్లి(అందోల్): పాఠశాలల అభివృద్ధికి మంత్రి దామోదర రాజనర్సింహ కృషి చేస్తున్నారని మాజీ ఎంపీపీ రాంరెడ్డి అన్నారు. మండల పరిధిలోని తాటిపల్లి కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల నుంచి ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు చేపట్టనున్న సీసీ రోడ్డు పనులు శనివారం సర్పంచ్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. అనంతరం రాంరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ స్వప్నభాస్కర్, మాజీ వీఆర్‌ఏ కల్లారెడ్డి, కస్తూర్బాగాంధీ ప్రిన్సిపాల్ కవిత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సతీష్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖమ్మంపల్లి పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్

మునిపల్లి(అందోల్): నో బ్యాగ్ డే సందర్భంగా మండల పరిధిలోని ఖమ్మంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాలైన రుచికరమైన వంటకాలు, స్వీట్లు తీసుకుని వచ్చి ఆహార పండుగను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఖమ్రోద్దీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిందితుడికి రిమాండ్

సదాశివపేట(సంగారెడ్డి): ఎస్‌మార్ట్ యాజమాని సెడిది శ్రీకాంత్‌పై శుక్రవారం రాత్రి కత్తిపోడిచి తీవ్రంగా గాయపర్చిన ఎండీ అయుబ్‌ను పోలీసులు శనివారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఎస్‌మార్ట్‌లో శుక్రవారం సాయంత్రం అయుబ్, శ్రీకాంత్ మధ్య ఓ వస్తువు కొనుగోలు తిరిగి వాపస్ ఇచ్చే విషయంలో గొడవ జరిగింది. ఈ విషయాన్ని మనసులో పెట్టుకొని అదేరోజు రాత్రి 10 గంటల సమయంలో కాపుకాసి ఎస్‌మార్ట్ యజమాని సెడిది శ్రీకాంత్‌పై అయుబ్ కత్తితో దాడి చేసి గాయపర్చాడు. శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు అయుబ్‌ను అదుపులోకి తీసుకుని అతనిపై హత్యయత్నం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

మంత్రి దామోదరను కలిసిన మార్కెట్ కమిటీ నూతన చైర్మన్

జహీరాబాద్: జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీకి నూతనంగా నియమితులైన సాయిచరణ్ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో శనివారం కలిశారు. సాయిచరణ్ తండ్రి జహీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ చీఫ్ కో–ఆర్డినేటర్, మాజీ మంత్రి చంద్రశేఖర్‌తో కలిసివెళ్లి మంత్రిని కలుసుకున్నారు.

బాలింతలకు కిట్స్ పంపిణీ



జోగిపేట(అందోల్): జోగిపేటలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో బాలింతలకు స్థానిక కేంబ్రిడ్జి పాఠశాల తరఫున బేబీ మల్టీపర్పస్ స్ప్రేలను, బేబీ పేస్ప్రేయర్, ఫీడింగ్ బాటిల్ క్లీనర్‌లను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ బెర్నమ్మ, డాక్టర్లు తేజ, నర్సింగ్ పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో జోగిపేట కేంబ్రిడ్జ్ పాఠశాల కరస్పాండెంట్ విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మణరావు, డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, ఇన్‌చార్జి హెడ్‌నర్స్ సుగుణమ్మ, ఫార్మసిస్ట్ నాగరాజు, శ్రీనివాస్‌రెడ్డి, ఐసీటీసీ కౌన్సిలర్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చండీహోమం

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం.. బొంతపల్లి పరిధిలోని వీరన్నగూడెంలోని భద్రకాళి సమేత వీరభద్ర ఆలయంలో శనివారం పూర్ణాహుతి, చండీహోమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శశిధర్, ఆలయ నిర్వాహకుడు సోమయ్య, భక్తులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీజీవన జ్యోతిర్లింగ శివాలయం నిర్మాణానికి ఊట్ల గ్రామ శివారులో వెంచర్ పనులు చేపట్టిన సీకేబాబు ఆలయ కమిటీ చైర్మన్ అంతిరెడ్డిగారి శ్రీనివాస్‌రెడ్డికి రూ.5లక్షల విరాళం అందజేశారు. గ్రామస్తులు ఆనంద్‌చారి, రాజేందర్‌రెడ్డి, అశోక్‌చారి, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్, నరేందర్‌గౌడ్, నరేష్, బ్రహ్మేంద్రగౌడ్, భాస్కర్, శివస్వాములు పాల్గొన్నారు.

తహసీల్దారుకు సన్మానం

నారాయణఖేడ్: ఖేడ్ తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన భాస్కర్‌ను సీపీఐ నాయకులు ఆనంద్, చిరంజీవి, అశోక్, లింగం, ఇసాక్, యాదవరావు, సంజీవ్ తదితరులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ అనుదీప్, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్‌బియ్యం పట్టివేత

మనూరు(నారాయణఖేడ్): మనూరు మండల కేంద్రం నుంచి అక్రమంగా రేషన్ బియ్యంను తరలిస్తున్న వాహనాన్ని డోవూర్ చౌరస్తాలో అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కపల్లి గ్రామానికి చెందిన సంతోష్ బొలెరో వాహనంలో 30క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంయుక్త స్కూల్‌ను సీజ్ చేయాలి

సంగారెడ్డి అర్బన్: ఇంటర్నేషనల్ స్కూల్ పేరుతో సంయుక్త పాఠశాల యాజమాన్యం అధిక ఫీజులను వసూలు చేస్తోందని, వెంటనే స్కూల్‌ను సీజ్ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో శనివారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్ సురేఖకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రమేశ్ మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండల పరిధి మల్కాపూర్ పెద్దాపూర్ శివారు మధ్యలో ఉన్న సంయుక్త ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం ఒక్కో విద్యార్థికి రూ.40 వేల నుంచి లక్షా మూపై వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. సంయుక్త ఇంటర్నేషనల్ పేరు మీద పర్మిషన్ రాకపోవడంతో ఇంటర్నేషనల్ అనే పేరును తొలగించి సంయుక్త స్కూల్ అని పెట్టడంతో తల్లిదండ్రులు మోసపోయారని పేర్కొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం

పటాన్‌చెరు టౌన్: మహిళా సాధికారతను సాధించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం లక్‌పతి దీదీ పథకం తీసుకొచ్చినట్లు మహిళా సమైక్య రిసోర్స్ పర్సన్ శేఖర్ అన్నారు. రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా పటాన్‌చెరు పట్టణంలోని మహిళా సమైక్య భవనంలో లక్‌పతి దీదీ పథకంపై శనివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఓ శ్రీనివాస్, సీసీలు నవీన్, జగదేవి, విజయలక్ష్మి, నిర్మల స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.